
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 14 । నవంబర్ । 2024



సోమశిలలో 68.87 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 68.87 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 8,993 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 50, ఉత్తరకాలువకు 550, కండలేరుకు 2,600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.77,460
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,035
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,246
సవర (8 గ్రాములు)	రూ.57,968

గరిష్టం/కనిష్టం
26.8 /23.6

వాతావరణం

జిల్లాలో గురువారం ఉరుములు మెరుపులతో కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 97 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

నెల్లూరు రూరల్: జిల్లాలో ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి కుమార్ రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రేబాలవారివీధిలోని రేబాల పట్టాభిరామిరెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బాలల దినోత్సవం రోజున వారోత్సవాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. 15న పుస్తక ప్రదర్శన, 16న దివంగత ఎస్‌ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, పాతూరి నాగభూషణం వంటి మహనీయుల సంస్కరణ సభ, ప్రముఖుల ప్రసంగాలు, 17న కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు చెప్పారు.

16న డీకేడబ్ల్యూలో జాబ్‌మేళా

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థినులతో పాటు గత విద్యాసంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థినులూ అర్హులన్నారు. చెన్నై, శ్రీసిటీకి చెందిన పలు కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు రెజ్యూమ్‌తో పాటు విద్యార్హత, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రావాలని తెలిపారు. ఇతర వివరాలకు 90306 65477 నంబరులో సంప్రదించాలన్నారు.

లా పరీక్ష నిర్వహణపై ఆరోపణలు



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న లా విద్యార్థులు

నెల్లూరు (టౌన్): స్థానిక మద్రాసు బస్టాండ్ సమీపంలోని వీఆర్ పీజీ కళాశాల లా పరీక్ష కేంద్రంలో బుధవారం పరీక్ష నిర్వహణపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నెల 5 నుంచి లా 5, 3 సంవత్సరాల విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే పరీక్షల్లో డిబార్ చేస్తామని ఇన్విజిలేటర్లు బెదిరిస్తున్నారని పరీక్ష అనంతరం బయటకు వచ్చిన కొంత మంది విద్యార్థులు పేర్కొన్నారు. అయితే ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపల్ తనూజారెడ్డిని వివరణ కోరగా పరీక్ష సమయంలో ఇన్విజిలేటర్లు స్ట్రిక్ట్‌గా ఉన్నారన్న దానిపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం పరీక్షల సందర్భంగా అబ్జర్వర్లు, స్క్వాడ్‌లను పంపించాలని వర్సిటీ వీసీని కోరగా పంపించారని, పరీక్షల్లో విద్యార్థులు మాల్ ప్రాక్టీసుకు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

108 ఉద్యోగుల సమ్మె బాట

- ఈ నెల 25 నుంచి చేస్తామని డీఆర్వోకు నోటీసు అందజేత



కలెక్టరేట్‌లో డీఆర్వోకు సమ్మె నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

నెల్లూరు (అర్బన్): ఈ నెల 25వ తేదీ తర్వాత సమ్మె చేయనున్నామని 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్.సతీష్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ 108 సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలోని ఈఎంటీ పోస్టుల్లో 108 వాహనాల ఈఎంటీలను నియమించాలని, పైలెట్లను ఆర్టీసీలో డ్రైవర్లుగా చేరేందుకు వెయిటేజీ ఇవ్వాలని కోరారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, సహజ మరణం, ప్రమాదాల్లో మృతి చెందిన ఉద్యోగులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని కోరారు. 108లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరుతూ సమ్మె బాట పట్టనున్నామన్నారు. ఇప్పటికే ఎన్నో విజ్ఞప్తులు చేసినప్పటికీ తమ సమస్యలు పరిష్కరించక పోవడం, జీతాలు ఇవ్వక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిరణ్‌కుమార్, నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయకుండానే నిధులు స్వాహా



జిల్లాలో టీడీపీ నేతలు ఉపాధి పథకాన్ని తమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. కూలీల కడుపు కొట్టి తమ జేబులు నింపుకుంటున్నారు. పనులు చేయకుండానే చేసినట్లు మార్ఫింగ్, డమ్మీ ఫొటోలు అప్‌లోడ్ చేసి బిల్లులు చేసుకుంటున్నారు. వాస్తవానికి పనికి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్.. కూలీలు పనిచేయక ముందు, పని చేసేటప్పుడు, చేసిన తర్వాత ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ఫొటోలు చూస్తే అవేం జరగడం లేదనే విషయం అర్థమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలను పనులకు రానీయకుండా అడ్డుకుంటూ యంత్రాలతో పనులు చేయిస్తున్నారు.

ఉపాధి హామీని సొమ్ము చేసుకుంటున్న పచ్చనేతలు


- వెబ్‌సైట్‌లో మార్ఫింగ్, డమ్మీ ఫొటోలు అప్‌లోడ్
- అవినీతిలో భాగస్వాములవుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉద్యోగులు

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పథకం పనులు పచ్చ నేతలకు కల్పతరువుగా మారాయి. కూలీల పేరుతో ఫేక్ ఐడీలు, డమ్మీ ఫొటోలు అప్‌లోడ్ చేసి ఉపాధి నిధులు స్వాహా చేస్తున్నారు. కూలీలు పని చేస్తున్న ఫొటోలను ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిత్యం ఉపాధి వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే టీడీపీ నేతలు పనికి సంబంధం లేని ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రధానంగా సీతారామపురం, ఉదయగిరి, రాపూరు, మర్రిపాడు, కలువాయి, కావలి, ఆత్మకూరు తదితర మండలాల్లో ఈ విధంగా చేస్తున్నట్లు డ్వామా అధికారులు గుర్తించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను అనేక ప్రాంతాల్లో తొలగించారు. టీడీపీ కార్యకర్తలను నియమించుకుని ఉపాధి నిధులు స్వాహా చేస్తున్నారు.

20 శాతం మందికే ఉపాధి పనులు

జిల్లాలో 37 మండలాల్లో 721 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో దాదాపు 3.41 లక్షల మంది జాబ్‌కార్డులు కలిగిన కూలీలు ఉన్నారు. అయితే ఇందులో కేవలం రోజుకు 60 వేల నుంచి 70 వేల లోపు మాత్రమే కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కూలీలు పనులు చేస్తారు. పని చేసే ప్రాంతం నుంచి ఆయా పంచాయతీలకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలు పనిచేయక ముందు, కూలీలు చేస్తున్న ఫొటోను, పనిచేసిన తర్వాత ఆ పనికి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. కానీ ఇందుకు భిన్నంగా టీడీపీ నేతలు కూలీల పేరుతో ఫేక్ ఐడీలు సృష్టించి యంత్రాలతో పనులు చేస్తూ.. డమ్మీ ఫొటోలు అప్‌లోడ్ చేసి బిల్లులు చేసుకుని స్వాహా చేస్తున్నారు.

యంత్రాలతో పనులు



ఉదయగిరి మండలం కొండాయపాళెం పంచాయతీలో చెయ్యి అడ్డంపెట్టి తీసిన ఫొటో అప్‌లోడ్ చేసిన సిబ్బంది

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలను పనులకు రానీయకుండా అడ్డుకుంటూ యంత్రాలతో పనులు చేయించి గతంలో చేసిన పనుల ఫొటోలను అప్‌లోడ్ చేసి నిధులు స్వాహా చేస్తున్నారు. ఇలాంటి పనులకు అడ్డుగా ఉంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి వారి అనుచరులను నియమించుకున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 250 పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి పచ్చనేతల అనుచరులను నియమించుకున్నట్లు సమాచారం. గతంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి ఉపాధి హామీకి సంబంధించిన ఫోన్లను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించిన పంచాయతీల్లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఫొటోలను పరిశీలిస్తే అధికారులకు విషయం అర్థమవుతుంది.

- ఈ నెల 7వ తేదీన ఉదయగిరి మండలం కొండాయపాళెం పంచాయతీలో చెయ్యి అడ్డం పెట్టి ఫొటో తీసి పది మంది కూలీలు పని చేస్తున్నట్లు వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు.
- సీతారామపురం మండలం నెమళ్లదిన్నె పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ అంటూ కూలీలు హాజరైనట్లు ఒకరున్న ఫొటోను అప్‌లోడ్ చేశారు.
- కలువాయి మండలం బాలాజీరావుపేట పంచాయతీలో పెట్టిన ఫొటోలనే మళ్లీ రోజు మార్చి రోజు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి కూలీలు హాజరైనట్లు పనులు చేస్తున్నట్లు నిధులు స్వాహా చేస్తున్నారు.



కలువాయి మండలం బాలాజీరావుపేటలో గతంలో పెట్టిన పాత ఫొటోనే అప్‌లోడ్ చేసిన సిబ్బంది

పచ్చనేతల కోసమే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పచ్చనేతల జేబులు నింపేలా ప్రణాళికలు రూపొందించారు. ఉపాధి హామీ ద్వారా నిధులు స్వాహా చేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టేలా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను నిర్మించేలా చర్యలు చేపడుతున్నారు. వాటితో పాటు రైతుల పొలాల్లో పంట కుంటలు (ఫాం పాండ్స్) తవ్వించేలా ప్రణాళికలు రూపొందించారు. దీనికి సంబంధించి సన్న, చిన్నకారు రైతుల పొలాల్లో పంట కుంటల తవ్వకాలకు చర్యలు చేపడుతున్నారు. గతంలో టీడీపీ హయాంలో జిల్లా వ్యాప్తంగా కొన్ని వేల సంఖ్యలో పంట కుంటలు తవ్వారు. ఒక్కొక్క పంట కుంట తవ్వకానికి రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఉపాధి హామీ నిధులను వెచ్చించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే ఒక్క పంట కుంట కూడా కనిపించదు. పంట కుంటలు తవ్వడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు అభివృద్ధి చెందడంతో పాటు రైతులకు సాగునీటి అవసరాలకు నీరు అందుబాటులో ఉంటుందని ముఖ్య ఉద్దేశంతో పంట కుంటలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటువంటి ఉన్నతమైన పథకానికి పచ్చ నేతలు తూట్లు పొడుస్తున్నారు. పంట కుంట తవ్వడం, బిల్లులు మంజూరైన వెంటనే వాటిని పూడ్చి పంటలు సాగు చేస్తున్నారు. ఆవులను, పశువులను పెంచేందుకు మినీ గోకులాలను కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. గతంలో నిర్మించిన మినీ గోకులాలు ప్రస్తుతం నిర్మిస్తున్న మినీ గోకులాలు కార్ల షెడ్లుగా ఉపయోగపడుతున్నాయి.



సీతారాపురం మండలం నెమళ్లదిన్నె పంచాయతీలో అప్‌లోడ్ చేసిన డమ్మీ ఫొటో

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు పనులు కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. కూలీల సంఖ్యను నిత్యం పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాం. పనులు జరుగుతున్న ప్రదేశంలో కూలీలు పనులు చేస్తున్న ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ విషయంలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో ఫొటోలను పూర్తి స్థాయిలో పరిశీలించి ఏఏ పంచాయతీల్లో కూలీలు లేని ఫొటోలను, పనులు లేని ఫొటోలను అప్‌లోడ్ చేశారో దానికి సంబంధించి సిబ్బందిపై చర్యలు చేపడుతాం.

– గంగాభవాని, డ్వామా పీడీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

చర్యకు ప్రతి చర్య తప్పదు

- వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమంగా కేసులు
- వీటిపై న్యాయపోరాటం చేస్తాం
- సూపర్ సిక్స్ హామీలు వచ్చే ఏడాదికైనా అమలు చేస్తారా?
- వైఎస్సార్‌సీపీ నెల్లూరురూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): నెల్లూరురూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏ తప్పు చేయకపోయినా అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని, భవిష్యత్‌లో చర్యకు ప్రతిచర్య తప్పదని ఆ పార్టీ నెల్లూరురూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక మాగుంట లేఅవుట్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కన పెట్టేస్తూ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారన్నారు. ఈ విధమైన ప్రభుత్వ ధోరణిపై సోషల్ మీడియా కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. తమ పార్టీ కార్యకర్తలతో పాటు సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమంగా కేసులు బనాయించి వారిని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. టీడీపీ, జనసేనకు చెందిన వారు అనేక అసత్య ప్రచారాలు చేస్తూ పోస్టులు పెడితే వారిపై ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అనేక మందిపై ప్రతి రోజూ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, ఇలాగే కొనసాగితే మాత్రం తాము చూస్తూ ఊరుకోబోమని న్యాయపోరాటం చేస్తామన్నారు. బుజబుజనెల్లూరులోని రేషన్ వాహనం నడుపుకుంటున్న ఓ వ్యక్తిపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారన్నారు. ఇదేమిటని బాధితుడు ప్రశ్నిస్తే తమకేమి తెలియదని ఏదైనా ఉంటే రూరల్ ఎమ్మెల్యే కలిస్తే ఆయన చెబితే కేసు తీసేస్తామని చెప్పడం ఇది ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రాథమిక విచారణ లేకుండానే కేసు ఎలా నమోదు చేస్తారని రూరల్ పోలీసులను ప్రశ్నించారు. తమ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, వారిని ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ముందు సూపర్ సిక్స్ ఇవ్వండి

ప్రశ్నించే ప్రజలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు నమోదు చేయడం కాదని, ముందు సూపర్ సిక్స్ పథకాలు ఇచ్చి మీ ప్రతాపం చూపించాలని విజయకుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ విషయాలను ప్రశ్నిస్తే కూటమి నేతల్లో సమాధానం లేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు వచ్చే ఏడాదికైనా అమలు చేస్తారో లేదో అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పేర్నేటి కోటేశ్వరరెడ్డి, బద్దెపూడి రవీంద్ర, పుచ్చలపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరావు (ఆర్‌ఎస్‌ఆర్), మదన్ మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నవీన్‌రెడ్డి, ఖాదర్ బాషా, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఒక్క కేసైనా నమోదైందా?

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పొట్టేపాళెం, ములుముడి ప్రాంతంలోని పెన్నానది నుంచి రోజుకు వందల ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లతో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని, ఈ ఆరు నెలల్లో ఒక్క కేసైనా నమోదు చేశారా? అని పోలీసులను నిలదీశారు. పొట్టేపాళెం ఇసుక రీచ్ నుంచి వందలాది ట్రాక్టర్లు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని పచ్చ పత్రికలే రాస్తున్నా.. ఎలాంటి చర్యలు లేవన్నారు. ములుముడికి రీచ్ లేదని అయితే రూరల్ ఎమ్మెల్యే అండతో కాగులపాడుకు చెందిన ఓ వ్యక్తి ఆ రీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా.. అధికారులెవరూ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. కానీ తప్పులు చేసే వారిని ప్రశ్నిస్తే మాత్రం కేసులు నమోదు చేస్తారా? అని నిలదీశారు.

అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదలం

- మాజీ మంత్రి కాకాణి హెచ్చరిక
- పోలీసుల విచారణకు హాజరు



విచారణ అనంతరం స్టేషన్ నుంచి బయటకు వస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : రాష్ట్రంలో అధికార మార్పిడికి ఎంతో కాలం లేదని, దగ్గరలోనే ఆ మార్పు సంభవిస్తుందని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు, తనపైన, పార్టీపైన ఆరోపణలు చేసిన ఎవరినీ వదిలి పెట్టే సమస్య లేదని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తల ఫిర్యాదు మేరకు కాకాణిపై నమోదైన కేసుకు సంబంధించి బుధవారం ఆయన ముత్తుకూరు పోలీసుల విచారణకు హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఐదు నెలల టీడీపీ పాలనలో తనపై నాలుగు కేసులు బనాయించారని గుర్తు చేశారు. పోలీసు వ్యవస్థపై విశ్వాసంతోనే విచారణకు హాజరయ్యామన్నారు. ముత్తుకూరు పోలీసులు తనకు 54 ప్రశ్నలు వేశారన్నారు. సోమిరెడ్డి, ఆయన తనయుడు కలిసి ఇసుక, మట్టి, గ్రావెల్, బెల్ట్ షాపులు, బూడిదకు సంబంధించి దోపిడీకి పాల్పడుతున్న వైనాన్ని ఆధారాలతో సహా వివరించామన్నారు. సోమిరెడ్డిపై తాము చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నామన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా, అధికార పార్టీ బెదిరింపులకు పాల్పడ్డా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. సర్వేపల్లిలోనే కాకుండా ఉమ్మడి జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో అనుచితంగా వ్యవహరించే వారిపై అధికారంలోకి రాగానే ఎఫ్‌ఆర్‌ఐలు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. అన్నిటినీ రికార్డు చేస్తున్నామని, జైలు పాల్జేస్తామన్నారు.

బెల్టు షాపులపై వ్యాఖ్యానించాను

మద్యం బెల్టు షాపుల ద్వారా చేస్తున్న దండకాలపై తాను చేసిన వ్యాఖ్యలకు, పెట్టిన పోస్టులకు తనపై కేసు పెట్టారని కాకాణి తెలిపారు. పోలీసులకు ఈ అంశాన్నే స్టేట్‌మెంట్ రూపంలో ఇచ్చానన్నారు. తాను ప్రశ్నించకుండా ఉండాలంటే సర్వేపల్లిలో అవినీతి జరగకూడదన్నారు. కాకాణి వెంట పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు నెల్లూరు శివప్రసాద్, దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక నాకు తోడెవరే..



సరోజనమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త పుల్లయ్య

- రైలు ఢీకొని మహిళ మృతి
- గుండెలవిసేలా రోదించిన భర్త

కోవూరు: వైద్యం నిమిత్తం భర్త సాయంతో ఆస్పత్రికి వెళ్తున్న భార్యను వందేభారత్ రైలు కబళించిన హృదయ విదారక ఘటన మండలంలోని ఇనమడుగు రైల్వే గేట్ వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. లేగుంటపాడుకు చెందిన సరోజనమ్మ (50)కు ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో భర్త గుండబత్తిన పుల్లయ్య సాయంతో కోవూరు వైద్యశాలకు బయల్దేరారు. గేట్ వేసి ఉండటంతో దాన్ని దాటి వెళ్లేందుకు యత్నించారు. భర్త ముందు వెళ్లగా, రైలొస్తున్న విషయాన్ని ఆమె పసిగట్టలేక పోయారు. రైలొస్తోందని తెలియజేసేందుకు ఆయన కేకలేసినా వినిపించలేదు. దీంతో చెన్నై నుంచి విజయవాడ వెళ్తున్న వందేభారత్ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అప్పటివరకు తోడుగా ఉన్న భార్య మరణించడంతో పుల్లయ్య గుండెలవిసేలా రోదించారు.